క్లుప్తంగా

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

బూర్గంపాడు: ఇందిరా క్రాంతి పథంలో వీఓఏలుగా పనిచేస్తున్న గ్రామదీపికలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అతితక్కువ వేతనంతో పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీఓఏలను సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటాలను కొనసాగించాలన్నారు. అందులో భాగంగా ఏప్రిల్ 17 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. అనంతరం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఏఎస్సై సత్యనారాయణకు సమ్మె నోటీస్‌ను అందించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీలక్ష్మి, పద్మావతి, కమల్, పోశమ్మ, పాపారావు, కమాల్‌బీ, రాయల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని ఉడతాని గుంపులో ఉన్న అమ్మనాన్న వృద్ధాశ్రమానికి ఆదివారం మణుగూరు ఏరియా సింగరేణి కాలరీస్ కంపెనీ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో కూలర్, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు దుర్గం సుమతి మాట్లాడుతూ.. సింగరేణి లేడీస్ క్లబ్ ఇటీవల కాలంలో సుమారు రూ.3 లక్షల విలువైన సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తారా ప్రసాద్ దంపతులు చిన్న వయసులో పెద్ద మనస్సుతో వృద్ధాశ్రమాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. తొలిసారి వృద్ధాశ్రమాన్ని సందర్శించిన సేవా అధ్యక్షురాలు సుమతిని నిర్వాహకులు, వృద్ధులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సేవా లేడీస్ క్లబ్ కార్యదర్శి డి.అనిత, క్లబ్ సభ్యుడు సువర్ణ, కవిత, స్వర్ణ, శోభ, సరిత, అరుణ, లక్ష్మి, సేవాసమితి సభ్యులు నాసర్ పాషా, నాని తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని కారుణ్య చైల్డ్ కేర్ సెంటర్ బాలల ఆశ్రమానికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి చింతల వినోద్ కుమార్ కుమార్తె శ్రీచైత్రిక జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిత్యావసర సరకులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు సునీల్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్, శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయ సేవా సమితి కోశాధికారి ఇల్లెందుల వెంకటేశ్వర్లు, చింతల కవిత, చవ్వా జై శంకర్, మణికంఠ సాయి రామ్ గుప్త, నాగచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న పంచాయతీ కార్మికుడు చిలుకూరి శ్రీనుకు రూ.25వేలు పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేశారు. అలాగే దుర్గాస్వీట్స్ యజమాని బిర్రు సుధాకర్ 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో భద్రాద్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి కంభంపాటి సురేష్ కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రథమ ఉపాధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్, ఆదివాసీ నాయకులు ముర్ల రమేష్, డిగ్రీ కాలేజ్ హిస్టరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వేముల కామేశ్వరరావు, సంకా కృష్ణార్జునరావు, చవ్వా జైశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత పువ్వాడకు ఎమ్మెల్యే పరామర్శ

అశ్వారావుపేట: అస్వస్థతకు గురై హైదరాబాదులోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీపీఐ జాతీయ నాయకుడు, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తండ్రి పువ్వాడ నాగేశ్వరరావును అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం ఆస్పత్రిలో కలిసి పరామర్శించారు. నాగేశ్వరరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బాధితుడికి మాజీ ఎమ్మెల్యే..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన పగిడిపల్లి జంపయ్యకు ప్రమాదవశాత్తూ కాలు విరగడంతో ఆదివారం ఆయనను మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. గ్రామంలో పర్వత నరేష్ తండ్రి సంజీవరావు సంవత్సరికం కార్యక్రమానికి పాయం హాజరై సంజీవరావు చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీ కమటం నరేష్, ఉపసర్పంచ్‌లు అక్కిన శ్రీనివాసరావు, అంకుష్ అలీ, నాయకులు ముత్తినేని వాసు, ఓరుగంటి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అటకెక్కిన పునరావాసం

- నాటి గోదారి వరదల్లో సమస్తం కోల్పోయిన బాధితులు
- నూతన గృహాలు నిర్మిస్తామన్న మంత్రి
- నెలలు గడుస్తున్న హామీ.. సమీపిస్తున్న మరో వర్షాకాలం
- ఆందోళన చెందుతున్న బాధితులు



వరద బాధితులకు పునరావాసం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ అనుదీప్ (ఫైల్)



నాడు వరదలతో అతలాకుతలమైన సున్నంబట్టి గ్రామం (ఫైల్)

దుమ్ముగూడెం: గత ఏడాది జూలై నెలలో వచ్చిన గోదావరి వరదలతో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు తుడిచిపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే. రెండు గ్రామాల్లోని ప్రజలకు జరిగిన లక్షల రూపాయల ఆస్తినష్టం, కోల్పోయిన ఇళ్ల కథలు ఇంకా కళ్ల మందరే కదలాడుతున్నాయి. ఆ సమయంలో వారి పునరావాసానికి ఇళ్లు నిర్మించి ఇస్తామన్న ప్రభుత్వ హామీ అటకెక్కింది.

కట్టుబట్టలతో జీవితం నెట్టుకొస్తూ..

గోదావరికి వచ్చిన వరదలకు సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలకు చెందిన కుటుంబాల వారు కట్టుబట్టలతో మిగిలారు. రెండు గ్రామాల్లోని ప్రజలు గోదావరిని నమ్ముకుని జీవించేవారు. మైదాన ప్రాంతంలోకి వెళితే జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఉన్న కాడనే పరిస్థితులను మెరుగుపరచాలని స్థానికులు డిమాండ్ చేస్తుండగా.. కరకట్టను నిర్మిస్తున్నాం.. ఇక ఎంత గోదావరి వచ్చిన ఎటువంటి ముంపు ఉండదని తప్పించుకునే ధోరణిలో అధికారుల తీరు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆచరణకు నోచుకోని హామీ..

వరదల సమయంలో ప్రభుత్వం తక్షణసాయం కింద రూ.10 వేలు ఆర్థికసాయం అందజేసింది. ఆ సహాయం కూడా అందరికీ చేరలేదు. ప్రభుత్వం అందజేసిన ఆర్థికసాయం ఏ పక్కకీ రాలేదు. ఈ నేపథ్యంలో నాడు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రెండు గ్రామాల ప్రజలకు మైదాన ప్రాంతంలో పునరావాసం కింద స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టి అందజేస్తామని ఆయా గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు వారం పది రోజుల్లోనే జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సున్నంబట్టి, కాశీనగరం గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించేందుకు మండలంలో ఉన్న మైదాన ప్రాంతాల స్థలాలను పరిశీలన చేశారు. అంజిపాక, రామచంద్రాపురం గ్రామాల్లో స్థలాలు పరిశీలించి రామచంద్రాపురంలో సర్వే నం.32లో 15 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇక ఇళ్ల నిర్మాణం చేపడతారు గోదావరి వరద బాధలు తీరినట్టే అని గ్రామస్తులు సంబరపడిపోయారు. ఇది జరిగి 9 నెలలు కావస్తున్న నేటి వరకూ పునరావాసం వైపు అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ మరల మాట్లాడకపోవడం బాధితులను నిరాశలోనికి నెట్టినట్టింది. గోదావరి వరదల సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇంట్లోని సామాన్లు, పశువులు, మేకలు అంతా వదిలేసి బతుకుజీవుడా అంటూ ప్రభుత్వం అరకొరగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న ప్రజలకు మంత్రి, అధికారుల పర్యటన అనంతరం ఇక మా బతుకులు బాగుపడతాయిలే అనుకున్నారు. కానీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పరిస్థితులు ఉంటాయని ప్రజలు గ్రహించడానికి ఇంత సమయం పట్టింది.

సమీపిస్తున్న వర్షాకాలం..

బాధితులకు పునరావాస గృహాలు నిర్మించడానికి స్థలం ఎంపిక చేసి నెలలు గడుస్తున్నా.. నేటి వరకూ ఉన్నతాధికారులు దానిపై ఒక అంచనాకు రాలేకపోయారు. మరోవైపు వర్షాకాలం ప్రారంభం కావడానికి ఇంకా రెండు నెలల సమయమే ఉంది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ వేసవిలో నిర్మించపోతే తరువాత కాలంలో నిర్మించడం కష్టతరం కావడం ఒక ఎత్తైతే.. రానున్న వర్షాకాలంలోనూ ఇదే తరహా వరద వస్తే పరిస్థితి ఏంటన్న ప్రశ్న మరో ఎత్తు. ఈ నేపథ్యంలో ఆ రెండు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

'సీతమ్మసాగర్'తో మరో ముంపు..

గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బహుళార్థక సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు తుడిచిపెట్టుకుపోయే పరిస్థితులు కనపడుతున్నాయి.గతంలో వచ్చిన గోదావరి వరదలకు ఎటువంటి పరిస్థితులు ఉద్భవించాయో కళ్లారా చూసిన ఆయా గ్రామాల ప్రజలు.. వర్షాకాలంలో సీతమ్మ సాగర్ బ్యాక్ వాటర్‌తో పరిస్థితులు ఎలా ఉండనున్నాయో అని ఆందోళన చెందుతున్నారు. సున్నంబట్టి నుంచి చర్ల మండలం వరకు భారీ కరకట్టను నిర్మిస్తుండటంతో ఇక గ్రామాలు మునిగే పరిస్థితులు రావని అధికారులు ప్రజలకు చెబుతున్నారు. కానీ వర్షాకాలం రావడానికి ఇంకా రెండు నెలల సమయం మాత్రమే ఉంది అప్పటికి ఈ కరకట్టల నిర్మాణం పూర్తి కావడం అనేది అసంభవం. అంటే మరోసారి గోదావరికి వచ్చే వరదలకు ప్రజలు ఇబ్బంది పడాల్సిందేనా అని ప్రజలు ఆలోచనలు పడ్డారు. ఉన్నతాధికారులు కలుగజేసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్మాణం త్వరగా చేపట్టండి



సున్నంబట్టి దగ్గర కరకట్ట నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి. మరి కొన్ని నెలల్లో వర్షాకాలం రానుంది. గతేడాది వచ్చిన వరదలతో తీవ్రంగా నష్ట పోయాం. అధికారులు మైదాన ప్రాంతంలో పునరావాసం ఏర్పాటు చేస్తామని చెప్పి ఇప్పుడు చేతులెత్తేశారు. మరోసారి ప్రజలు నష్టపోకుండా అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలి.

– యంబడి అర్జునరావు, సున్నంబట్టి గ్రామం

ముంపునకు గురికాకుండా చూడండి



గత ఏడాది వచ్చిన గోదావరి వరదలకు కాశీనగరం గ్రామం నామరూపాలు లేకుండా పోయింది. అధికారులు పర్యటించి పునరావాసం ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారు కానీ నేటి వరకూ ఆ ఊసే ఎత్తడం లేదు. మరో దఫా ముంపునకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గడ్డం ఆదాం, ముంపు బాధితుల సాధన సమితి అధ్యక్షుడు

బీఆర్‌ఎస్‌కు మూకుమ్మడి రాజీనామా



రాజీనామా వివరాలు వెల్లడిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

బూర్గంపాడు: బీఆర్‌ఎస్ పార్టీకి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులు రాజీనామా చేశారు. బూర్గంపాడు మండలానికి చెందిన పొంగులేటి వర్గీయులు ఆదివారం లక్ష్మీపురం గ్రామంలో సమావేశమయ్యారు. మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు మూకుమ్మడి రాజీనామాలు సమర్పించారు. పొంగులేటిని బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయడానికి నిరసనగా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆవుల నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ పాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మోరంపల్లి బంజర ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అంజనాపురం ఉపసర్పంచ్ భాస్కర్, సొసైటీ డైరెక్టర్ బత్తుల రామకొండారెడ్డి, పలువురు గ్రామపంచాయతీ వార్డుసభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ మండల నాయకులు మూకుమ్మడి రాజీనామా చేసినవారిలో ఉన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డితోనే తమ రాజకీయ ప్రయాణం ఉంటుందని వారు పేర్కొన్నారు.

గ్రామాల్లో సంతకాల సేకరణ

దమ్మపేట: పేద ప్రజలకు 12 రకాల నిత్యావసరాలను రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ఉచితంగా అందించాలని కోరుతూ.. ప్రగతిశీల మహిళ, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సంతాకల సేకరణ ప్రారంభించారు. మండల పరిధిలోని పార్కలగండి, జమేదారుబంజర, చిల్లగుంప గ్రామాలలో ప్రగతిశీల మహిళ, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రజల మద్దతూ కోరుతూ.. వారి నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు కాక వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి నిత్యావసరాలైన బియ్యం, పప్పులు, నూనె, పిండి తదితర వస్తువులను రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేసి, ప్రతి పేదవాడికి రేషన్ కార్డుని తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కురం పోతురాజు, జల్లి నాగమణి, కారం రాంబాబు, తెల్లం బంగారమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

దుమ్ముగూడెం: మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మి మెమోరియల్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2004–05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు.

ఈ సందర్భంగా అనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ప్రస్తుత వారి జీవిత విషయాలను పంచుకుంటూ సందడి చేశారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సుదర్శన్, రాజేంద్రప్రసాద్, మురళి, కృష్ణమాచార్యులు, కోట శ్రీనివాసరావు, అచ్యుతానందరావు, మైకిల్ ప్రసాద్, కోటేశ్వరరావు, వేణు అనంద రెడ్డి, పనిశ్రీ, పుష్ప శ్రీ,తస్నీరు శ్రీనివాసరావులను ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు మోతుకూరి శ్రీకాంత్, ఆలా వినయ్, కొత్త చిరంజీవి, పులుసు వంశీ, గజ్జల రవి, శెట్టి ఈశ్వర రావు, బర్ల సంజీవరావు, నాగిరెడ్డి, తుమ్మల ప్రేమ్, గంప నాగేశ్వరావు, కోట సందీప్, రాచకొండ చైతన్య, సోడి రాజేష్, కుర్సం ప్రసాద్, అర్జ సురేష్, డేగల వెంకటేశ్వర్లు, భీమ్ రావు,బర్ల భార్గవ్, రమాదేవి, వర లక్ష్మి, సరిత, లావణ్య, సునీత, దుర్గా దేవి, సత్యవేణి, త్రివేణి, రూపులత, సుధారాణి, ముత్యవాలి, వెంకటలక్ష్మి, సరస్వతి బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఎమ్మెల్యే వీరయ్య

దుమ్ముగూడెం: మండలంలోని లచ్చిగూడెం గ్రామంలో జరుగుతున్న తులసమ్మ అమ్మవారి జాతరలో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ వారు డప్పువాయిద్యాలు, మేళతాళాలతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో లచ్చిగూడెం సర్పంచ్ ఇర్ప చంటి, కాంగ్రెస్ నాయకులు తెల్లం నరేష్,ఉబ్బా వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నల్లా నీరు అందించాలి

దుమ్ముగూడెం: మండలంలోని ప్రతి ఇంటికీ నల్లీ నీరు అందించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి సాయన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో ఇరిగేషన్ శాఖ, మిషన్ భగీరథ అధికారుల పనితీరుపై ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ.. మండలంలో వందకి 30 శాతం వాటర్ ట్యాంకులు పనిచేయడం లేదని అన్నారు. మండలంలో రిపేర్‌లో ఉన్న ట్యాంక్‌లను మరమ్మతు చేసి నీళ్లు ఎక్కించాలని, రోడ్డు పక్కన ఉన్న కుండీలకు మూతలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రజలకు నీళ్లు అందించకుంటే ప్రజలను ఐక్యం చేసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సున్నం వీరభద్రం, శంకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను విమర్శించే అర్హత లేదు

భద్రాచలంఅర్బన్: ప్రజా ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టులను విమర్శించే అర్హత భద్రాచలం కాంగ్రెస్ నాయకులకు లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. విమర్శలకు స్థానిక శాసనసభ్యుడు పోదెం వీరయ్య ఏమైనా అతీతుడా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో చేసిన పోరాటాలు, నిర్వహించిన ఉద్యమాలు ఏంటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పొత్తుల గురించి మాట్లాడే స్థాయి, అర్హత బుడగం శ్రీనుకు లేదని అన్నారు. భద్రాచలం పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని పోరాటం చేసి, నిరాహార దీక్షలు చేసిన చరిత్ర సీపీఎంకు ఉన్నదన్నారు. పోలవరం పాపం కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పొత్తు ఉన్నా పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు



ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

భద్రాచలంఅర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో భద్రాచలం ఫైర్ ఆఫీసర్ గుర్రపు శ్రీనివాస్, భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణల ఆధ్వర్యంలో అగ్నిమాపక అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్పత్రిలో జరిగే అగ్ని ప్రమాదాలు, ఎలక్ట్రిక్, గ్యాస్, కెమికల్, ఆయిల్ అగ్నిప్రమాదాలు, రెస్పిరేషన్ విధానాల గురించి వైద్యులు, స్టాఫ్ నర్సులు, సెక్యూరిటీ సిబ్బంది, ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన ప్రజలకు అగ్నిమాపక అధికారులు వివరించారు. ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ ప్రవీణ్, అగ్నిమాపక సిబ్బంది, లీడింగ్ ఫైర్‌మెన్ కోదండరామిరెడ్డి, డ్రైవర్/ఆపరేటర్ కుమారస్వామి, ఫైర్‌మెన్‌లు శివాజీ, కిరణ్ పాల్గొన్నారు.

విప్పపువ్వు లడ్డూల పంపిణీ



విప్పపువ్వు లడ్డూలను పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట మండలం గొగులపూడి, దమ్మపేట మండలం పూచికుంట గ్రామాల్లోని కొండరెడ్లకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, భద్రాచలం ఆధ్వర్యంలో ఆదివారం విప్పపువ్వులతో చేసిన పౌష్టికాహారపు లడ్డూలను పంపిణీ చేశారు. గతేడాది కొండరెడ్లను కలిసి వారి స్థితిగతులు తెలుసుకున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహించగా 120 కుటుంబాల వారిలో రక్తహీనత అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వీరికి విప్పపువ్వుతో తయారు చేసిన లడ్డూలను పౌష్టికాహారంగా పంపిణీ చేశారు.

ఆరోగ్యశిబిరం నిర్వహించి రక్త నమూనాలను సేకరించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ ఎస్ఎల్ కాంతారావు, ఎన్ఐఎన్ న్యూట్రిషియన్ డాక్టర్ పి.రాజశేఖర్, డాక్టర్ భానుప్రసాద్, వైవి.సూర్యనారాయణ, వి.రంగారెడ్డి, కె.వెంకటరెడ్డి, సర్పంచ్ దుర్గ, రాజిరెడ్డి, మోహన్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభకు రైతులు హాజరయ్యేనా..?

అశ్వాపురం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొంది ఎన్నో అవార్డులు పొందిన నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రస్తుతం అవినీతి ఆరోపణలు, నిధుల దుర్వినియోగంతో అభివృద్ధిలో వెనుకంజ వేస్తోంది. నేడు మొండికుంటలోని నెల్లిపాక సహకార సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన సంఘం మహాజన సభ నిర్వహించనున్నారు. 2021–22 ఏడాదిలో ప్రస్తుత పాలకవర్గం హయాంలో రూ.20,06,252 నిధుల దుర్వినియోగానికి సంబంధించి నేటి మహాజన సభకు ప్రాధాన్యత ఉంది. మార్చి 31వ తేదీన మహాజన సభ నిర్వహించగా 60 మంది సభ్యులు మాత్రమే హాజరుకావడంతో సభను వాయిదా వేశారు. సోమవారం నిర్వహించనున్న సభకైనా సంఘం సభ్యులు మెజార్టీ సంఖ్యలో హాజరవుతారో లేదో వేచి చూడాలి.

ముమ్మరంగా వరి కోతలు



ఆర్ కొత్తగూడెంలో వరిపంట కోస్తున్న యంత్రం

చర్ల: మండలంలో రబీ వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. చర్ల మండలంలోని ప్రధాన సాగునీటి వనరు అయిన తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్ కింద మొదటి జోన్‌తో పాటు, చెరువులు, విద్యుత్ మోటార్ల ఆధారంగా రబీలో వరి పంట సాగు చేశారు. పంట చేతికందడంతో ఇప్పటికే ప్రారంభమైన కోతలు.. ముమ్మరంగా సాగిస్తున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ క్షేత్రాల్లో వరి కోత మిషిన్లు సందడి చేస్తున్నాయి. మండలంలోని తేగడ, సత్యనారాయణపురం, ఆర్ కొత్తగూడెం, కుదునూరు, మామిడిగూడెం, చినమిడిసిలేరు, జీపీ పల్లి, మొగళ్లపల్లి, చింతకుంట, మొగళ్లపల్లి, సీ కత్తిగూడెం తదితర గ్రామాల్లో రైతులు వరి కోత పనులు చేపట్టారు.

రంజాన్ కిట్ల పంపిణీ



ముస్లింలకు కిట్లు అందజేస్తున్న ఐటీసీ ఉన్నతాధికారులు

బూర్గంపాడు: సారపాకలోని సాజిదా మజీద్‌లో ఆదివారం పేద ముస్లింలకు జమాతే ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఐటీసీ పీఎస్‌పీడీ మానవ వనరుల విభాగం మేనేజర్ శ్యామ్‌కిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీసీ పీఎస్‌పీడీలోని ముస్లిం ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ కిట్లను అందించటం అభినందనీయమన్నారు. ఐటీసీ సీనియర్ మేనేజర్ మరడాన శ్రీనివాస్, కార్మికసంఘాల నాయకులు కనకమేడల హరిప్రసాద్, యారం పిచ్చిరెడ్డి, గొనె రామారావు, గాదె రామకొండారెడ్డి, జమాతే ఇస్లాం హింద్ అధ్యక్షుడు జహీర్‌పాషా, అలీమ్, షేక్ అబ్దుల్ సలీమ్, ఇషాక్, బషారత్, సైదుద్దీన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

అశ్వాపురం: క్రీడల వల్ల క్రీడాకారులకు శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని కొమ్ముగూడెం గ్రామంలో శ్రీరామ ఆంజనేయ యూత్ ఆధ్వర్యంలో అశ్వాపురం, మణుగూరు రెండు మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్ ద్వితీయ బహుమతిని రూ.5,116 కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటబోయిన నాగేశ్వరరావు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాదె కేశవరెడ్డి, కాటబోయిన నాగేశ్వరరావు, నాయకులు ముత్తినేని వాసు, వేములపల్లి రమేష్, ఓరుగంటి రమేష్, పూనెం కోటయ్య, ఊకె రామయ్య, బొజ్జ కృష్ణ, సోందె రమేష్, వజ్జా ప్రసాద్, నర్సింహారావు, శ్రీను, ఉపేందర్, వంశి, సురేష్, యువత, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి అస్తవ్యస్తం



మొండికుంట, భద్రాచలం క్రాస్‌రోడ్డు మధ్య అధ్వానంగా ఉన్న రహదారి

అశ్వాపురం: మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై బూర్గంపాడు మండలం భద్రాచలం క్రాస్ రోడ్డు నుంచి మణుగూరు వరకు దారి అస్తవ్యస్తంగా తయారైంది. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

బూర్గంపాడు మండలం భద్రాచలం క్రాస్ రోడ్డు నుంచి మొండికుంట, సీతారాంపురం, గొల్లగూడెం, అశ్వాపురం, జగ్గారం, మిట్టగూడెం, కల్యాణపురం మీదుగా మణుగూరు వరకు మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. గుంతలమయమై దారుణంగా తయారైంది. గుంతల్లో వాహనాలు అదుపు తప్పి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైంది. నిత్యం ఇసుక లారీలు, బొగ్గు లారీలు, పరిశ్రమలకు సంబంధించిన భారీ వాహనాలు, బస్సులు, ప్రైవేటు వాహనాలు వందల సంఖ్యలో నడిచే ఈ రహదారి అస్తవ్యస్తంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం..

ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ హరిలాల్ స్పందిస్తూ.. మొండికుంట నుంచి మణుగూరు వరకు మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు చేపడతామని వెల్లడించారు.